క్లుప్తంగా

అబ్బురపరిచిన విద్యార్థుల యోగా విన్యాసాలు



కైకరం హైస్కూలు గ్రౌండులో విద్యార్థులు యోగాసనాలు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: యోగా దినోత్సవం సందర్భంగా కైకరం విద్యార్థుల యోగా విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు యోగాసనాలతో పాటు కొన్ని విచిత్రమైన విన్యాసాలు చేశారు. శ్వాసమీద పట్టు సాధించడం, వంటి ప్రక్రియలు సాధన చేశారు. హెచ్ఎం ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు నాగసుధ, పాపాయమ్మ ఆధ్వర్యంలో యోగా విన్యాసాలు చేశారు. విద్యార్థులు, సామూహికంగా చేసిన ఆసనాలు అబ్బురపరిచాయి.

బురదమయంగా తహసీల్దారు కార్యాలయం రోడ్డు



తహసీల్దారు కార్యాలయం రోడ్డుపై వర్షం నీరు

ఉంగుటూరు: వర్షం వస్తే చాలు ఉంగుటూరులో తహసీల్దారు కార్యాలయం రోడ్డు బురదమయంగా దర్శనమిస్తోంది. మండలంలోని ప్రజలు ఈ రహదారిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు వారి అవసరాల కోసం నిరంతరం రాకపోకలు సాగిస్తుంటారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రహదారిపై నీరు నిలిచి బురదమయమైంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతూ ప్రయాణించారు. రెండు దశాబ్దాల క్రితం ఈ సిమ్మెంట్ రహదారి నిర్మించడంతో రహదారి బీటలు వారి గోతులు ఏర్పడ్డాయి. ఈ రహదారి పునర్నిర్మాణానికి పంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



నారాయణపురం ఎంపీపీ స్కూల్లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న బండారు నాగరాజు

ఉంగుటూరు: ప్రభుత్వ కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు వృద్ధిలోకి రావాలని ఉంగుటూరు మండల ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు అన్నారు. శనివారం నారాయణపురం సచివాలయ -1 పరిధిలోని ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలను శనివారం సర్పంచి అలకానంద, నాగరాజు పంపిణీ చేశారు.హెచ్ఎం సూరిబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునేందుకు పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందని వివరించారు. పంచాయతీ సభ్యులు నేదూరి గంగాధర్, శ్రీధర్, లంకా రవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పునాది ధ్వంసంపై ఫిర్యాదు

పెదవేగి : పిల్లర్ల దశ ఉన్న అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారంటూ ఐసీడీఎస్ పెదపాడు ప్రాజెక్ట్ సీడీపీఓ విజయలక్ష్మి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెదవేగి ఎస్సై వీ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం భోగాపురం 2 అంగన్‌వాడీ కోడ్ నంబర్ 185కు చెందిన కేంద్ర కొన్నేళ్లుగా పునాది, పిల్లర్ల దశలోనే ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు నిర్మాణంలో ఉన్న భవనాన్ని ధ్వంసం చేశారని సీడీపీఓ విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

హోంగార్డుల కుటుంబాలకు అండగా ఉంటాం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో పోలీస్ సంక్షేమంతోపాటు, హోంగార్డుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని, హోంగార్డుల కుటుంబాలకు తాము అండగా ఉంటామని ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో హోంగార్డులకు ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో ఎస్పీ అందజేశారు. ఏలూరు హోంగార్డు యూనిట్‌లోని సీహెచ్ పుల్లారావు భీమవరం సబ్‌యూనిట్‌లో హోంగార్డుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు హోంగార్డు సంక్షేమ నిధి నుంచి రూ.5లక్షల 43వేల 150 విలువైన చెక్కును హోంగార్డు పుల్లారావుకు అందజేశారు. అదేవిధంగా ఏలూరు యూనిట్‌లో హోంగార్డుగా పనిచేసిన ఎస్.దుర్గాప్రసాద్ అనారోగ్య కారణాలతో మృతిచెందారు. ఆయన భార్య దుర్గకు సంక్షేమ నిధి నుంచి రూ.5లక్షల 41వేల 40 విలువైన చెక్కును జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అందజేశారు.

మలుపులు... ప్రమాదాలకు నిలయాలు

- ఆదమరిస్తే అంతే సంగతులు
- కానరాని హెచ్చరిక బోర్డులు



గణపవరం బొబ్బిలి వంతెన వద్ద ఆకివీడు రోడ్డు మలుపులో వాహనాలు



పిప్పర కనకదుర్గ గుడి వద్ద ప్రమాదకర మూడు రోడ్ల కూడలి



రాచూరులో ప్రమాదకరమైన మలుపులో వాహనదారుల ఇక్కట్లు



గణపవరం సెంటర్ బండిరేవు వద్ద ఇరుకైన మలుపు



కొమ్మర రోడ్డులో వెలగపల్లి వద్ద ప్రమాదకర మలుపు

గణపవరం: గణపవరంలో పలుచోట్ల ఆర్అండ్‌బీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా తయారయ్యాయి. గణపవరం నుంచి తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు వైపు వెళ్లే రహదారులపై కొన్నిచోట్ల ఎల్ ఆకారంలో, మరి కొన్ని చోట్ల టి ఆకారం, ఎస్ ఆకారంలోనూ మలుపులు ఉన్నాయి. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మలుపుల వద్ద వాహనాలు వెంట్రుక వాసిలో ప్రమాదాల బారి నుంచి బయట పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనం సమీపంలోకి వస్తే తప్ప కనిపించని పరిస్థితి ఉంది. గణపవరం-తాడేపల్లిగూడెం రహదారిలో గణపవరం సెంటర్‌కు అతి సమీపంలో బండిరేవు వద్ద ఎల్ ఆకారంలో ఉన్న మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. ఇక్కడ వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వాహనాలను నడుపుతుంటారు. బొబ్బిలి వంతెన దిగువున మూడు రోడ్ల కూడలిలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఏలూరు వైపు వెళ్లే వాహనాలు, ఆకివీడు వైపు నుంచి వచ్చే వాహనాలు ఒకేసారి మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పుకోవడం గగనంగా ఉంటుంది. వాహనాలు ఎదురెదురుగా సమీపంలోకి అంటే ఐదారు అడుగుల దూరంలోకి వస్తే తప్ప కనిపించక పోవడం వల్ల నిత్యం ప్రమాదం పొంచి ఉంటుంది. భీమవరం వైపు వెళ్లే రహదారిలో సరిపల్లె వెలంపేట వద్ద, బీసీ కాలనీల వద్ద ఉన్న ఎల్ ఆకారపు మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు. బాలయ్య చెరువు వద్ద ఉన్న మలుపులోని మార్జిన్‌లో వాహనాలు నిలుపుదల చేసి ఉండటం వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవడం ఇబ్బందికరంగా ఉంది. మందలపర్రు వంతెన వద్ద, నాగనమిల్లి పుంత మునసలమ్మ గుడి వద్ద ఉన్న మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. మందలపర్రు వంతెన మలుపు ప్రమాదకరంగా ఉంటుంది. ఈ మలుపు గమనించక ఇటీవల లారీ, టాక్సీతో సహా నాలుగు వాహనాలు కాలువలోకి దూసుకుపోయాయి. నిడమర్రు సమీపంలో నాగనమిల్లి ఎస్ టర్నింగ్ ప్రమాదాలకు నిలయంగా ఉంటుంది. ఈ మలుపులో అనేక ప్రమాదాలు జరిగాయి. ఇలాంటి ప్రమాదకర మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా చెట్లు, తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగి ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి ఉంది. నిడమర్రు గ్రామ పరిధిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద, హైస్కూలు వద్ద, నిడమర్రు సెంటర్‌లో ఎల్ ఆకారంలో ఉన్న మలుపులు ప్రమాద భరితంగా ఉన్నాయి. రాచూరు గ్రామ పరిధిలో పాము మెలికల మాదిరిగా ఉండే మలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. ఈ మలుపులో రోడ్డును చేర్చి ఇళ్లు, ప్రహరీ గోడలు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. అంతేకాక రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వచ్చిన వాహనాలను తప్పించుకు వెళ్లడం చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. గ్రామాల పరిధిలో ఇలాంటి మలుపుల వద్ద వ్యాపారులు తమ వ్యాపారాలను రోడ్డు మీదికి పొడిగించి షెడ్లు, పందిర్లు వేయడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. గణపవరం పరిధిలో ఏలూరు రోడ్డు వైపు, గూడెం రోడ్డు వైపు, భీమవరం రోడ్డు వైపున రోడ్డు మార్జిన్లను ఆక్రమించి వ్యాపారులు ముందుకు చొచ్చుకుని రావడంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. ఇలాంటి మలుపుల వద్ద అధికారులు ఆక్రమణలు పూర్తిగా తొలగించి, హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణలు మార్గ సూచికలు ఏర్పాటు చేస్తే కొంతైనా ఫలితం ఉంటుందని వాహనదారులు కోరుతున్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే ధర్మరాజు



ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజుకు శ్రీవారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ అధికారులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటిండెంట్ రమణరాజు తదితరులున్నారు.

పాఠశాలల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పెదపాడు: పాఠశాలల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని పెదపాడు ఎంఈఓ సబ్బితి నర్సింహ మూర్తి ఉపాధ్యాయులను ఆదేశించారు. పెదపాడు మండలంలోని సీతారామపురం మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించడమే జాబ్‌మేళా లక్ష్యం



నారాయణపురంలో ఉద్యోగాలకు ఎంపికైన వారితో ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు తదితరులు



జిల్లా నలుమూల నుంచి హాజరైన నిరుద్యోగులు

- నారాయణపురంలో 14 కంపెనీల రాక
- 76 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఉంగుటూరు: ప్రతిష్టాత్మక కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు జాబ్‌మేళాలు ద్వారా కల్పించడం జరుగుతోందని నేషనల్ కెరియర్ సర్వీసెస్, కోఆర్డినేటర్, ఏలూరు జిల్లా యంగ్ ప్రొఫెషనల్ జి. ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కష్ట పడేతత్వం యువకులు అలవర్చుకోవాలన్నారు. సర్పంచి దిడ్ల అలకానంద మాట్లాడుతూ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని కోరారు. సెట్ వెల్ సీఈవో మెహర్‌రాజు మాట్లాడుతూ ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జాబ్‌మేళాలు నిర్వహిస్తామని వివరించారు. ఎంప్లాయిమెంటు జిల్లా ఆఫీసరు వరలక్ష్మి, మోడల్ రిసోర్సు సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సామర్థ్యం కలిగిన వారి కోసం కంపెనీలు ఎదురు చూస్తున్నాయని అన్నారు. ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తమ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించడం మంచి పరిణామమన్నారు. నిరుద్యోగులకు, కంపెనీల ప్రతినిధులకు సర్పంచి అలకానంద శ్రీనివాస్ ఉచిత భోజనాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సర్పంచి అలకానంద శ్రీనివాసరావును సత్కరించారు. వివిధ కంపెనీల సీఈవోలు మేనేజర్లు కంపెనీల్లో ఉన్న ఖాళీలు, జీతాలు వివరించారు. జాబ్‌మేళాకు 183 మందికి పైగా హాజరుకాగా 76 మందికి ప్లేస్‌మెంట్స్ లభించాయి. అపాక్ ఫైనాన్సు, పేటియం, మోహన్ స్పింటస్ టెక్సు, అపోలో టైర్సు, లైఫ్ ఇన్సురెన్సు కార్పొరేషన్, ముత్తూట్ మినీ మ్యాక్సు సెక్యూరిటీస్, రెడ్డిఅండ్‌రెడ్డి మోటార్స్, టాటా మోటార్స్ తదితర కంపెనీలు హాజరయ్యాయి. తాడేపల్లిగూడెం డియర్ గోయంకా కళాశాల విద్యార్థులు 18 మంది, గణపవరం గవర్నమెంటు డిగ్రీ కళాశాల విద్యార్థులు 12 మంది, జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం, చింతలపూడి, ఏలూరు కళాశాలలకు చెందిన విద్యార్థులు అధ్యాపకుల హాజరయ్యారు.

దాతల సహకారం అభినందనీయం

గణపవరం: పేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వంతోపాటు దాతలు తమవంతు ప్రోత్సాహం అందించడం అభినందనీయమని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని గణపవరం ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. శనివారం గణపవరంలోని చినరామచంద్రపురం పాఠశాలలో సైలెంట్ సర్వీస్ సేవా సంస్థ గణపవరంలోని ఐదు పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వంతోపాటు దాతలు, సేవా సంస్థలు అండగా నిలుస్తున్నాయని ఇది శుభపరిణామన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యాసామగ్రిని ఎంఈవో చేతులమీదుగా పంపిణీ చేశారు. హెచ్ఎం వెంకటరత్నం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత అర్హతలు కలిగిన సీనియర్ ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జె.సత్యనారాయణ, జె.నాని, టి.అర్జున రావు, ఎలిశెట్టి త్రినాద్, టి.తేజ పాల్గొన్నారు.



గణపవరంలో పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో శేషు

సీపీఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేయండి

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉద్యోగుల ఆందోళన, వారి డిమాండ్ల విషయాన్ని థాయిలాండ్‌లోని యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాలని కంపెనీ హెచ్ఆర్‌ను పెద్దాపురం డీఎస్పీ లతకుమారి కోరారు. గణపవరంలో మూతపడిన సీపీఎఫ్ రొయ్య, చేప మేతల తయారీ సంస్థ ఉద్యోగులు తమకు న్యాయం చేయాలని, నియామక సమయంలో కంపెనీ యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ రాజమండ్రిలోని సీపీఎఫ్ కంపెనీ గేటు వద్ద కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. శనివారం పెద్దాపురం డీఎస్పీ లతకుమారి ఆందోళనకారుల వద్దకు వచ్చి వారి సమస్యలను అడిగారు. ఈ సందర్భంగా వారు కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని, కంపెనీని తిరిగి ప్రారంభించాలని వారు నినాదాలు చేశారు. తమకు న్యాయం జరిగేవరకూ ఆందోళన కొనసాగిస్తామని ఉద్యోగుల పోరాట సమితి తెలిపింది.ఉద్యోగుల సమస్యల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కంపెనీ హెచ్ఆర్‌కు డీఎస్పీ సూచించారు.



రాజమండ్రి సీపీఎఫ్ కంపెనీ వద్ద ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎస్పీ లతకుమారి

దాతల సహకారంతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు



పాతూరులో దాతలు బహూకరించిన ఫర్నిచర్‌ను అందుకుంటున్న ఎంఈవో

భీమడోలు: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలు సహకారం మరవలేనిదని భీమడోలు ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. మానవత మండల అధ్యక్షుడు వట్టి గుణాకర్ తండ్రి వట్టి వీరవెంకట సత్యనారాయణ 100వ జయంతిని పురస్కరించుకుని శనివారం పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. వట్టి సుగుణాకర్ ఆర్థిక సాయంతో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రూ.35వేల విలువ గల ఆర్వో ఫిల్టర్, సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు ప్రాథమిక పాఠశాలకు రూ.15వేల విలువ గల 2 సన్‌గ్లాస్ ఆఫీస్ టేబుళ్లు, చైర్లను బహూకరించారు. పాఠశాలలోని చిన్నారులకు పాఠ్యపుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకర్, జిల్లా కమిటీ చైర్మన్ అప్పక రాంబాబు, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ పాల్గొని ప్రసంగించారు. పాతూరు పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్ సమకూర్చడంతో మండే సుధాకర్ చూపిన చొరవ అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఎంఈవో

ఘనంగా ఏరువాక పౌర్ణమి



దెందులూరులో ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

దెందులూరు: దెందులూరులో ఏరువాక పౌర్ణమి శనివారం ఘనంగా నిర్వహించారు. దేశానికి అన్న పెట్టే రైతన్న తన భూమికి సంప్రదాయబద్ధంగా భూమికి, నాగళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. రైతులు ఏరువాక పూజను జ్యేష్ట పౌర్ణమి ప్రత్యేక ముహూర్తంగా భావించి భూ మాతకు నాగళ్లకు పూజలు చేస్తారని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. అనంతరం రైతులు కొలుసు గణపతిరావు, వీరమాచినేని శివాజీ, కొలుసు నాని, సంపంగి వేణుగోపాల్ తిలక్, దేవినేని తులసిదాస్, కూచిపూడి ఫణి నాగళ్లతో భూమిని దున్నారు. గ్రామంలో ఏరువాక వేడుకను చూసేందుకు అధిక సంఖ్యలో రైతులు, కుటుంబ సభ్యులు పొలాలకు వచ్చారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

దెందులూరు: సంపూర్ణ పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా శనివారం సానిగూడెంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఏలూరు డీఎల్‌పీఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే ఆ గ్రామ ప్రజలు, కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటాయని ఆయన అన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది చేస్తున్న కృషికి స్థానిక ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తేనే సత్ఫలితాలు వస్తాయన్నారు. సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు) మాట్లాడుతూ ఆరు రోజులుగా సానిగూడెం పంచాయతీ శివారు ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని వివరించారు. దెందులూరు ఈఓఆర్‌డీ టీఎస్ స్వామి, పెదవేగి ఈఓఆర్‌డీ శ్రీనివాసరావు, సానిగూడెం గ్రామ కార్యదర్శి ఎస్‌వీ కిషోర్ ఉన్నారు.



సానిగూడెంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఏలూరు డీఎల్‌పీఓ చంద్రశేఖర్

విద్యాదానం మహాదానం



డీఎస్పీ జి.లక్ష్మయ్యను సత్కరిస్తున్న కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కాకర్ల శ్రీను

పెదపాడు : అన్ని దానాల్లో కల్లా విద్యాదానం మహోన్నతమైనదని ఒక డివిజన్, పోలీస్ ఉన్నతాధికారిగా విధులు నిర్వహిస్తూనే మరోవైపు విద్యాభివృద్ధి, విద్యపై అవగాహన కోసం విశిష్ట సేవలందిస్తున్న నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య అభినందనీయమని కార్మిక సంఘ రాష్ట్ర నాయకులు కాకర్లశ్రీను అన్నారు. శనివారం కలపర్రు టోల్‌గేట్ కార్యాలయంలో డీఎస్పీ లక్ష్మయ్యను ఆయన సత్కరించారు. డీఎస్పీ విధులు నిర్వహించిన ప్రతి ప్రాంతంలోనూ ఇప్పటి వరకు విద్యార్థులకు, యువతకు, ఎన్‌జీవోలకు ఉచితంగా జీకే, సైకాలజీ, వివిధ కవులు రాసిన రచనలు దాదాపు 1,272 పుస్తకాలు అందించి పలువురు మన్ననలు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరుల విద్యాభివృద్ధి, కుటుంబాభివృద్ధి, సమాజాభివృద్ధి కోసం కొంతైనా స్వచ్ఛంద సేవ చేస్తే ప్రతి ప్రాంతం, ప్రతి కుటుంబం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. డీఎస్పీ లక్ష్మయ్య స్ఫూర్తితో నేటి యువత, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఎన్‌జీవోలు, తమ వంతు విద్యాభివృద్ధి కోసం సేవలందించాలని కాకర్ల శ్రీను అన్నారు. అనంతరం శాలువా, పూలదండ, జ్ఞాపికతో డీఎస్పీని సత్కరించారు.

జాబ్‌మేళాలో 12 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు

గణపవరం: నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో గణపవరం మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన 12 మంది విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికై నట్లు ప్రిన్సిపల్ నిర్మలకుమారి తెలిపారు. మొత్తం 18 మంది విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరుకాగా వారిలో 12మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారికి నారాయణపురం డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు ఆఫర్ లెటర్లను అందజేశారు. ఎంపికైన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన కాలేజి ప్లేస్‌మెంట్ అధికారి

రేపు కొత్తపల్లిలో అన్నదానం

దెందులూరు: కొత్తపల్లిలోని వీరాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 24న సోమవారం మహాన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయిబాబా గుడికి వెళ్లే దారిలో చెరువు గట్టు దగ్గర ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు.

ట్రాక్టర్లతో చెత్త తరలింపు

దెందులూరు: సంపూర్ణ పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా ఐదు రోజుల్లో దెందులూరు గ్రామ శివారు ప్రాంతాల్లో చెత్తను తొలగించి ట్రాక్టర్లతో తరలించామని గ్రామ కార్యదర్శి వీఎస్ చౌదరి అన్నారు. శనివారం ఆయన గ్రామ సచివాలయంలో మాట్లాడుతూ ఐదు రోజులుగా 12 ట్రాక్టర్లు చెత్త తరలింపునకు పనిచేస్తున్నాయని, ఒక్కొక్క ట్రాక్టర్ 8 ట్రిప్పులు తిరుగుతున్నట్టు తెలిపారు. పనులను మండల ఈఓఆర్‌డీ టీఎస్ స్వామి, దెందులూరు సర్పంచ్ తోట ఏసమ్మ పర్యవేక్షిస్తున్నారని కార్యదర్శి చౌదరి వివరించారు.

ఉంగుటూరులో భారీ వర్షం

ఉంగుటూరు: ఉంగుటూరులో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దాంతో గ్రామాల్లోని రహదార్లు జలమయమయ్యాయి. భారీ వర్షం కురవడంపై రైతున్నలు ఆనందం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించిన రైతులకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడనుంది. డెల్టాలో, మెట్టలో పొలాల్లో దమ్ము చేసేందుకు ఈ వర్షం దోహదం చేస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ వర్షం ఖరీఫ్ సీజను ప్రారంభానికి వ్యవసాయ పనులు ముందుకు వెళ్లడానికి ఉపయోగంగా మారింది.